# ఓ పైవుందా సార్!

ఈ వ్యాసం మకుటం చూస్తే నేనేదో అప్పుల అప్పారావు గురించి వ్రాస్తు న్నాననుకుంటున్నారా? కాదు. అవును.

ఈమధ్య పేపర్లలో టీవీలో న్యూ ఎకానమీ, ఓల్డ్ ఎకానమీ అనే మాటలు వింటున్నాం. వాటి అర్థం ఏమిటి, తేడాలేమిటి అనేది ఆర్థిక సూత్రాలు తెలియని వాళ్ళకి కూడా అర్థమయేంత సులభంగా చెబుదామని చేసే ప్రయత్నం ఇది.

ఒక వూళ్ళో రెడ్డిగారి పార్టీకీ, నాయుడుగారి పార్టీకీ పోట్లాట వచ్చిందిట. ఈ రోజుల్లోలా బాంబులతో కాకుండా, ఆ రోజుల పద్ధతి ప్రకారం పాపం కర్రలతో కొట్టుకుంటున్నారుట. ఇరుపక్షాల వారికీ తలకాయలు పుచ్చకాయల్లా పగిలిపోతు న్నాయి. రక్తం కారిపోతున్నది. కానీ అక్కడ రచ్చబండ మీద ధర్మారావుగారు తాపీగా చుట్ట తాగుతూ కూర్చుని, ఆ ప్రత్యక్ష ప్రసారం చూస్తూ ఆనందిస్తున్నాడుట.

'ఏం రావుగారూ.... అంత కొట్టుకుంటున్నా మీ దగ్గరికి ఎవరూ రావటం లేదు, ముట్టుకోవటం లేదు. దీని భావమేమిటి' అని అడిగాడు ఒక తిరుమలేశుడు.

'ఏముంది. రెండు పార్టీల దగ్గరా చచ్చేంత అప్పులు తీసుకున్నాను. నన్ను చంపితే, వాళ్ళిచ్చిన డబ్బులకి కూడా నాతోపాటూ స్మశాన ప్రాప్తిరస్తు. అందుకని నన్ను ఎవరూ ముట్టుకోరు' అన్నాడుట ఇంకా తాపీగా ధర్మారావు.

మేము డెభ్భైలలో ఇండియాలో వున్నప్పుడు అప్పారావు మీద జోకులే కాకుండా, ఎవరైనా అప్పులు తీసుకుంటే వాళ్ళని చులకనగా చూసేవాళ్ళు. 'వాడో అప్పుల పాలైన వెధవ' అని తక్కువ చేసి మాట్లాడేవాళ్ళు. అప్పు చేసి పప్పు కూడు అనే సినిమా కూడా వచ్చింది. ఇల్లు కట్టుకోవాలంటే చాలమంది స్వంత డబ్బుల తోనో, పిఎఫ్ లోన్‌తోనో కట్టుకునేవాళ్ళు. ప్రావిడెంట్ ఫండ్ వాళ్ళకి రావలసిన డబ్బే కనుక, దాన్ని ఒక అప్పుగా చూసేవాళ్ళు కాదనుకుంటాను.

'మా ఖర్చులన్నా తగ్గించుకుంటాం కానీ, బొందిలో ప్రాణముండగా అప్పులు మాత్రం చేయను' అని నిశ్చయంగా చెప్పిన వాళ్ళు కొల్లలు.

'లోనులకి లోను కావద్దు' అనే నీతి సూత్రాన్ని లక్షరాలా పాటించేవాళ్ళు ఆనాటి లోహితాస్యులు.

ఆ నేపధ్యంలో అమెరికాకి వచ్చిన నాకు, ఈ దేశంలో వున్నవాళ్ళంతా అప్పారావులే అయేసరికీ ఆశ్చర్యమేసింది. బాంక్‌లోని రెండు వేలూ చూపించి, నా మొదటి కారు కొందామని నాలుగు వేలు అప్పు అడిగితే ఇవ్వమన్నారు. కారణం నేను అప్పుల అప్పారావుల లిస్టులో లేనని. అంటే నాకు ఎస్టాబ్లిష్డ్ క్రెడిట్ లేదని. అంటే బాంక్ బాలన్స్ కాదు ముఖ్యం. అప్పులు చేసి ఒప్పందం ప్రకారం తీరుస్తున్నానా లేదా అని. దాన్నే క్రెడిట్ రేటింగ్ అంటారు.

ఇంకో తెలుగప్పారావుగారి సలహా పాటించి, ఒక క్రెడిట్ బ్యూరోలో పది డాలర్లు కట్టి నా పేరు అప్పారావుల లిస్టులో నమోదు చేయించుకున్నాను. దాని

అర్థం ఏమిటంటే, నాకూ అప్పులు చేసే శక్తి వుందనీ, ఇంతవరకూ అప్పులు ఎగ్గొట్ట లేదు కనుక, నా క్రెడిట్ రేటింగ్ బావుందనీ. దానితో నాకు వెంటనే కారు కొనుక్కో టానికి అప్పు దొరికింది.

ఇదేదో సరదాగా వ్రాసింది కాదు. నిజంగా నా పేరంత నిజం. అప్పటికీ ఇప్పటికీ క్రెడిట్ రూల్సులో కొన్ని మార్పులు వచ్చినా, పరిస్థితి కొంచెం తేడాతో దాదాపు అలానే వుంది.

ఏమిటి నాయనా, అప్పు చేసినందువల్ల నీకు లాభాలు?

మీకు తెలిసినవే. ఇప్పుడు ఇండియాలో కూడా జరుగుతున్నదే పదిహేను వేల డాలర్లు ఖరీదు చేసే కారు కొనుక్కోవాలంటే అంత డబ్బు సామాన్యుల చేతిలో వుండటం కష్టమే. మన దగ్గరున్న పాత కారుని ఇచ్చేసి, అదీ లేకపోతే ఖాళీ చెయ్యి చూపించి, ఏ ఐదేళ్ళకో లోన్ తీసుకుంటే, నెలసరి వాయిదాలు చెల్లించటం సులభం. అలాగే చేతిలో మూడు వేల డాలర్లుంటే, లక్ష డాలర్ల ఇల్లు కొనటమూ సులభమే. ఎపార్ట్‌మెంట్‌కి కట్టే అద్దె ఇంటి పేమెంట్ కింద కట్టేస్తే ఇల్లు మనదై పోతుంది.

అలాగే ఎన్నో వస్తువుల మీద, తీర్థయాత్రలు ప్రేమయాత్రలతో సహా, సులభ వాయిదాలలో అప్పులు దొరుకుతాయి. ఆదాయం చూసుకుని అప్పులు చేసి నందువల్ల మన జీవన సరళి మెరుగవుతుంది. పీకలు మునగవు. మనకి కావలసినవి కొనుక్కోటానికి, జీవిత కాలం ఎదురు చూడాల్సిన అవసరం లేదు.

అయితే ఏమిటి బాబూ, అప్పులు చేయటం వల్ల నష్టాలేమిటి?

అప్పులు తలకు మించినవీ, తనకు మించినవీ అయితే తల మునిగేటంత నష్టమూ, కష్టమూ. జీవితాలు నాశనమయేది కూడా అందుకనే. మన తలపుల తలుపులు అవసరమైనంత వరకే తెరిస్తే, మెడ మీద తలలు బాగానే వుంటాయి.

మందుని అవసరార్థం మందు లాగానే తీసుకోమన్నట్టుగా, అప్పుని అవసరార్థం అప్పులాగానే తీసుకుంటే వ్యక్తిగతంగా అనర్థాలు రాకుండా వుండటమే కాకుండా, దేశ ఆర్థిక పరిస్థితికి కూడా లాభాలు వున్నాయి.

అది సరేనయ్యా... నువ్వు అవన్నీ కొనుక్కుంటే, నీకు లాభం కానీ దేశాని కేమిటి లాభం?

ఇదీ మీకూ నాకూ తెలిసిన జవాబే. జనానికి కొనుగోలు శక్తి పెరుగుతుంది. అది పెరిగితే ఎక్కువ వస్తువులూ, పరికరాలూ, కార్లూ, ఇళ్ళూ కొంటారు. వాటి ఉత్పత్తి ఎక్కువ చేయటానికి కంపెనీలు ఎక్కువమందిని వినియోగించాల్సి వస్తుంది. అంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఉద్యోగాభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయి. నిరుద్యోగుల సంఖ్య తగ్గుతుంది. దానివల్ల ఇంకా ఎక్కువమందికి కొనుగోలు శక్తి వస్తుంది. మళ్ళీ...

మళ్ళీ వ్రాయటం అనవసరం. ముందు వాక్యాలు మళ్ళీ చదివితే సరి. అంతేకాదు. తీసుకున్న అప్పులు సవ్యంగా తిరిగివస్తే బ్యాంకింగ్ బిజినెస్ బాగుపడుతుంది. ఎక్కువ డబ్బు వాడుకలోకి వస్తుంది.

మరి దీని వల్ల ఇన్ఫ్లేషన్ పెరగదా?

పెరగవలసిన అవసరం లేదు కానీ, పెరిగే అవకాశాలు వున్నాయి. అదెలాగో, దాన్ని సవరించే విధానాలేమిటో ఇంకొకసారి చెప్పుకుందాం.

మరింతకీ ఓల్డ్ ఎకానమీ, న్యూఎకానమీ అంటే ఏమిటో చెప్పవేం అని అడుగుతున్నారు కదా. చూద్దాం అదేమిటో.

తెలుగులో వీటికి అనువాదం పాత ఆర్థిక పరిస్థితి, కొత్త ఆర్థిక పరిస్థితి అంటే నాకు బాగాలేదు. అందుకని పాత ఆర్థిక సిద్ధాంతాలు, కొత్త ఆర్థిక సిద్ధాంతాలు అందాం.

'ధరలు పెరిగిపోతున్నాయండీ, పోయిన ఏడాదికీ ఇప్పటికీ ఎంత పెరిగాయో చూశారా', 'మా చిన్నప్పుడు దోశె పావలా వుండేది. ఇప్పుడు.. 'బస్సు చార్జీలు రైలు చార్జీలు అన్నీ పెరిగిపోయాయి. మా రోజుల్లో అయితేనా.. ఇలాటి మాటలు వినటం, అనటం మనం చూస్తూనే వుంటాం. అంటే ఏమిటి? రోజులు గడుస్తున్న కొద్దీ ధరలు పెరుగుతూనే వుంటాయి. ఎందుకని? ఇన్ఫ్లేషన్, పెరుగుతున్న జీతాలు. ముడి సరుకు ధరల, రవాణా ఖర్చుల పెరుగుదల... ఇలా చాల కారణాలు వున్నాయి. ఇదీ ఓల్డ్ ఎకానమీ. అంటే మనందరికీ తెలిసిన పాత ఆర్థిక సిద్ధాంతాల మీద నడిచే వ్యవస్థ.

1984లో అనుకుంటాను నేను నా మొదటి కంప్యూటర్ కొన్నాను. అది ఎక్సటి అని, బేసిక్ కంప్యూటర్. ఈ రోజుల్లోలా డి.వి.డీ.లు, సి.డీ.లు, హార్డ్‌డ్రైవ్‌లూ లేవు. ఒక ఐదంగుళాల ఫ్లాపీ డిస్క్ వుండేది. మెమరీ కూడా చాల తక్కువ. మూడు వేల డాలర్లకి కొన్నాను. దానికి తోడు బయట వుండే హార్డ్ డ్రైవ్ ఇంకో మూడొందల డాలర్లకి కొన్నాను. తర్వాత కొన్నేళ్ళకి అంతకన్నా మంచిది 286 కంప్యూటర్ 2500 డాలర్లకి కొన్నాను. దాంట్లో అంతకు ముందుకన్నా చాల టెక్నాలజీ వుంది. తర్వాత అంతకన్నా గొప్పది 386 కంప్యూటర్ 2000కి కొన్నాను. దాని తర్వాత 486, తర్వాత పెంటియం... చాల ఎక్కువ మెమరీ, రకరకాల డ్రైవులూ, మ్యూజిక్, సినిమాలూ, ఇంటర్నెట్, వైర్‌లెస్... చెప్పుకుంటూ పోతే చాల వున్నాయి. ఇలాటి కంప్యూటర్ల ఖరీదెంతో తెలుసా? 400 డాలర్ల నించీ వెయ్యి లోపు. కంప్యూటర్ల గురించి అంతగా తెలీని వాళ్ళకి ఇంకో చిన్న ఉదాహరణ. మీరు 1970, 80లలో కొన్న నలుపు తెలుపు టీవీ కన్నా, 90లలో కొన్న రంగుల టీవీ ఖరీదు తక్కువ. ఆనాటి రంగుల టీవీ కన్నా, ఎక్కువ టెక్నాలజీ వున్న ఈనాటి టీవీల ఖరీదు ఇంకా తక్కువ. అంటే ఏమిటి? మీరు ఒకప్పుడు ఖర్చు పెట్టిన దాని కన్నా కూడా, ఎంతో తక్కువ ధరలకి ఎంతో నాణ్యత, సాంకేతికంగా వున్నతమైన పరికరాలు దొరుకుతున్నాయి. అంటే మనం పైన చెప్పుకున్న పాత ఆర్థిక సిద్ధాంతాలకి విరుద్ధంగా జరుగుతున్నది.

దాన్నే కొత్త ఎకానమీ, కొత్త ఆర్థిక సిద్ధాంతం అంటున్నారు నిపుణులు. అంతకన్నా ఏంలేదు.

అది సరేగానీ, మీ దగ్గర ఓ ఫైవ్ వుందా?

0 0 0